www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 5 మే 2023
4
తిరుపతి



24న నావిక్-1 ఉపగ్రహ ప్రయోగం



ప్రజాశక్తి - సూళ్లూరుపేట

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి మే 24వ తేదీన జీఎస్ఎల్‌వి ఎఫ్12 రాకెట్ ద్వారా నావిక్ -01 (ఐఆర్ఎన్ఎస్ఎస్-1జె) అనే ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. షార్‌లోని రెండో ప్రయోగవేదిక నుంచి దీనిని నిర్వహించేందుకు మొదటి అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో రాకెట్‌ను అనుసంధానం చేసే పనులు ప్రారంభించారు. షార్‌లో లాంచింగ్ వసతులు పెరిగిన నేపథ్యంలో నెలకు ఒక ప్రయోగం చేయాలని ఇస్రో శాస్త్రవేత్తలు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 22న పిఎస్ఎల్‌వి సి55ను ప్రయోగించారు. ఈ ప్రయోగం పూర్తయిన వెంటనే మే 24న జిఎస్ఎల్‌వి ఎఫ్12 ద్వారా నావిక్ 01 ఉపగ్రహ ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టంను బలోపేతం చేయడానికి ఈ ప్రయోగం చేస్తున్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులకు సెలవులు

ఉన్నట్టా... లేనట్టా..!



ప్రజాశక్తి - బాలాయపల్లి

ఉపాధ్యాయుల వేసవి సెలవులకు రాష్ట్ర ప్రభుత్వం మంగళం పాడింది. ఇప్పటివరకూ వెకేషన్ ఉద్యోగులుగా ఉన్న టీచర్లు ఇప్పుడు నాన్-వెకేషన్ ఉద్యోగులుగా మారిపోయారు. ప్రభుత్వంలో ఏ ఉద్యోగికీ లేని వెసులుబాటు ఉపాధ్యాయులకు ఉండేది. దశాబ్దాలుగా వేసవి సెలవులు తీసుకునే అవకాశం వారికి కొనసాగుతోంది. అందుకే మిగతా ప్రభుత్వ ఉద్యోగులకు ఏడాదికి 30 ఆర్జిత సెలవులు(ఈఎల్స్) ఇస్తే, టీచర్లకు కేవలం ఆరు మాత్రమే ఇస్తున్నారు. అయితే ప్రభుత్వం టీచర్లకు వేసవి సెలవుల్లో అనేక పనులు అప్పగిస్తూ తాజాగా షెడ్యూలు విడుదల చేసింది. అందుకోసం టీచర్లందరూ పాఠశాలలకు రావాలా? లేదా? అనేదానిపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. కానీ ఎక్కడున్నా ఇచ్చిన టాస్క్ మాత్రం కచ్చితంగా పూర్తిచేయాలని ఆదేశించింది.

ఉపాధ్యాయులకు సెలవులు లేవా

విద్యార్థులకు మాత్రమే సెలవులని,

వాట్సప్‌లలో విద్యార్థులకు తరగతులు
తల్లిదండ్రులతోనూ మాట్లాడాలి
ఎక్కడ ఉన్నా 'టాస్క్' పూర్తవ్వాలి

టీచర్లకు కాదని చెబు తున్నారు. ప్రతి ఏటా ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు విద్యార్థులతోపాటు టీచర్లకు సెలవులు ఇచ్చేవారు. అయితే పాఠశాల ప్రధానోపా ధ్యాయుడుకి, రికార్డు అసిస్టెంట్‌లను మాత్రం నాన్-వెకేషన్ ఉద్యోగులుగా పరిగణిస్తారు. అందుకే వారికి 30 ఈఎల్స్ ఇచ్చి, మిగిలిన టీచర్లకు ఆరు ఇస్తారు. ప్రభుత్వం కొత్తగా టీచర్లకు సెలవులు అక్కర్లేదనే చెప్పింది.

తరగతుల వారీగా పనులు

ఒకటి నుంచి పదో తరగతి వరకు టీచర్లందరికీ తరగతుల వారీగా వేర్వేరు పనులు అప్పగించారు. ఒకటో తరగతి విద్యార్థులు ఆకులు, పూలు సేకరించి, వాటిని లెక్కించడం నేర్పించాలని, వివిధ బొమ్మలు గీసేలా చూడాలని ఆదేశించారు. వారిలో మానవతా విలువలు పెంపొందించాలని, సజనాత్మక నైపుణ్యాలు, మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు పెంచేలా కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. ఇలాగే అన్ని తరగతుల విద్యార్థులకూ భాషా నైపుణ్యాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచాలని సూచించారు. విద్యార్థులకు కొన్ని పదాలు ఇచ్చి వాటిని ఎలా పలకాలో నేర్పించాలని, బొమ్మలు ఇచ్చి రంగులు వేయించాలని, పొడుపు కథలు నేర్పించాలని, చిన్న చిన్న కథలు చెప్పాలని, బొమ్మలతో సామెతలు నేర్పించాలని, ఒక పదం చెప్పిన సంబంధిత అంశాలు చెప్పగలిగేలా మైండ్ మ్యాప్ రూపొందించేలా ప్రోత్సహించాలని, కొన్ని గణిత సమస్యలను పరిష్కరించేలా చూడాలని నిర్దేశించారు. వీటిని అప్పగించి వదిలేయకుండా పాఠశాలల పున్ణప్రారంభం రోజున వాటిని బడిలో



వేసవి సెలవుల్లోనూ శిక్షణ

ప్రదర్శించాలనే షరతు పెట్టారు.

తల్లిదండ్రులతో మమేకం

ఉపాధ్యాయులు రోజూ విద్యార్థులతో టచ్‌లో ఉంటూ, వారి కార్యకలాపాలు పర్యవేక్షిస్తూ, ప్రోత్సహించాలి. విద్యార్థులు చేసే పనులను ఫొటోలు, వీడియోలు, నివేదికల రూపంలో సేకరించాలి. ఇందుకోసం వేర్వేరుగా కార్యాచరణ షెడ్యూలు తయారు చేసుకుని విద్యార్థులను, వారి తల్లిదం డ్రులను ఇందులో భాగస్వామ్యం చేయాలి. ఇక ఉపాధ్యాయులంతా వారి తరగతుల విద్యార్థులతో వేర్వేరుగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేయాలి. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఒక నోట్ బుక్ నిర్వహించేలా చూడాలి. పాఠశాలల పున్ణ ప్రారంభ సమయంలో వాటిని సమర్పించాలి. పుస్తకాలు చదివేలా విద్యార్థులను ప్రోత్సహిస్తూ, వారికి కొన్ని పుస్తకాలు సూచించాలి. విద్యార్థులు వారి సమీప గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు తెచ్చుకోవడంపై అవగాహన కల్పించాలి. కొన్ని అంశాలపై ఆన్‌లైన్ తరగతులు, వెబినార్లు నిర్వహించాలి. విద్యార్థుల్లో సజనాత్మకత పెంచేందుకు ప్రాజెక్టులు అప్పగించాలి. క్రీడలు, డ్యాన్స్, యోగాలో విద్యార్థులు పాల్గొనేలా చూడాలి. ఈ కార్యకలాపాలను పాఠశాల విద్య వెబ్‌సైట్‌లో లేదా ఆ శాఖ సోషల్ మీడియాలో ప్రదర్శించాలి.

సహకార 'కుంపటి'



ఇప్పటి వరకు జాతీయ బ్యాంకులను ప్రయివేటీకరించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా సహకార బ్యాంకుల్లోనూ ప్రయివేటు కుంపటి పెట్టేందుకు యోచిస్తోంది. ఆ మేరకు ఏపీలో రూ.5200 కోట్లతో సహకార బ్యాంకుల బలోపేతం అంటూ పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా ప్రకటించడం దీనికి బలాన్ని చేకూరుస్తున్నాయి. అదే జరిగితే జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ పరిధిలోకొచ్చే రైతు సహకార సంఘాలన్నీ ప్రైవేటుపరం కానున్నాయి.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఇప్పటి వరకు ఈ సంఘాల్లో రైతులే భాగస్వాములుగా ఉండేవారు. ఒక్కో మండలానికి ఒకట్నుంచి మూడేసి వరకు సహకార సంఘాలున్నాయి. ఒక్కో సంఘ పరిధిలో పది నుంచి పదిహేను గ్రామాలకు చెందిన రైతులు షేర్ హోల్డర్స్‌గా ఉన్నారు. ఈ సంఘాల్లో షేర్లను ఆయా సంఘాల పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులు మాత్రమే కొనుగోలు చేసే వెసులుబాటుండేది. ఈ సభ్యుల నుంచే సంఘాల పాలకమండలిని ఎన్నుకునేవారు. వారి అదుపాజ్ఞల్లో సంఘాల నిర్వహణ జరిగేది. కాగా ప్రభుత్వం 1964 సహకార చట్టంలోని 11వ అంశంలోని 115వ డి నిబంధనను సవరించింది. దీనికి బదులుగా డి/ఇ పేరిట మరో నిబంధన తెచ్చింది. ఈ మేరకు సహకార సంఘాల పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన రైతులు కాని వ్యక్తులు, వ్యాపారులు, కంపెనీ చట్టం ప్రకారం నమోదైన సంస్థలు. కూడా ఈ సంఘాల్లో వాటాలు కొనుగోలు చేసే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. ఇలా వాటాదారులైన వ్యక్తులు లేదా సంస్థలకు ఓటు హక్కు లభిస్తుంది. సంఘాల పాలకమండలి ఎన్నికల్లో వీరంతా పోటీ చేయెచ్చు. గెలుపొందొచ్చు. అదే జరిగితే ఇంతవరకు రైతుల మధ్య మాత్రమే జరిగే లావాదేవీలపై ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు, పారిశ్రామికవేత్తల పెత్తనం మొదలవుతుంది. ఈ సంఘాలపై వారి అజమాయిషీ పెరుగుతుంది. వీలైనంత మేరకు ఈ సంఘాల్లో పెట్టుబడులు పెట్టి వీరే షేర్లు కొనుగోలు చేస్తారు. సభ్యత్వాల సంఖ్యను బట్టి వీరే పాలకమండలిని నిర్ణయిస్తారు. దీంతో సంఘానికి చెందిన ఆర్థిక వ్యవహారాలన్నీ వీరే చక్కబెడతారు. సంఘాలకున్న నిధులు, ఆస్తులపై వీరిదే పెత్తనమౌతుంది. ఇలా ఇప్పుడు రైతుల కోసం, రైతులచేత నిర్వహించబడుతున్న సహకార సంఘాలన్నీ ఇకముందు ప్రైవేటు బ్యాంకులుగా మారిపోతాయి. ప్రైవేటు వ్యక్తుల అదుపాజ్ఞలకు లోబడే సహకార సంఘాలు రైతులకు రుణాలిస్తాయి. ఇందుకోసం ప్రైవేటు వ్యక్తులు విధించే నిబం ధనలకు తలొగ్గాల్సి ఉంటుంది.

సిబ్బందిపై అదనపు భారం

మరోవైపు సహకార సంఘాల సిబ్బందిపై ప్రభుత్వం అదనపు భారం మోపుతోంది. ఉమ్మడి చిత్తూరు 76 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. 38 జిల్లా కేంద్ర బ్యాంకులు ఉన్నాయి. సుమారు 250 మంది సిబ్బంది, 10 లక్షల మంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారు. రూ.8 వేల కోట్ల ఆర్థిక లావాదేవీలు ఈ సంఘాల ద్వారా జరుగుతుండటం గమనార్హం. వీటన్నింటి ఆర్థిక లావాదేవీలపై ప్రభుత్వం పన్ను విధించింది. ఇలా ఏటా కోటిరూపాయల వరకు ఈ బ్యాంకు ఖాతా నుంచి ప్రభుత్వం పన్నుగా బదలాయిస్తోంది. ఒక్కో సహకార సంఘంలో ముగ్గుర్నుంచి ఐదుగురు వరకు సిబ్బంది ఉన్నారు. ఈ సంఘాల ఆర్థిక లావాదేవీలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలు, ధాన్యం సేకరణ బాధ్యతను కూడా ప్రభుత్వం వీరికప్పగిస్తోంది. అలాగని సకాలంలో ఈ సంఘాలకు ధాన్యం సమీకరణపై కమిషను జమ చేయడంలేదు. ఉమ్మడి జిల్లాలో ఇలా ధాన్యం కమిషన్ ఇప్పటికే ఐదుకోట్ల వరకు ప్రభుత్వం బకాయిపడింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణను ఈ సహకార సంఘాలన్నీ ఈ కమీషన్ సొమ్మునుంచే భరిస్తున్నాయి. కాగా కమీషన్ సొమ్ము విడుదల కాకపోవడంతో అప్పులు చేసి ఈ ఖర్చుల్ని సంఘాల సిబ్బంది నెట్టుకురావాల్సొస్తోంది. ఈ దశలో వార్షిక లావాదేవీలు రూ. కోటి దాటితే రెండుశాతం టిడిఎస్ చెల్లించాలన్న ప్రభుత్వ నిబంధనతో సంఘాల ఆర్థిక పరిస్థితి మరింత కుదేలౌతోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సగానికి పైగా నష్టాల్లోనే నడుస్తున్నాయి. ఈ సాకుతో వీటినిప్పుడు ప్రైవేటు పరం చేస్తే ఈ సంఘాలకున్న అత్యంత విలువైన స్థిరాస్తులపై ప్రైవేటు వ్యక్తుల పరోక్ష పెత్తనం మొదలయ్యే ప్రమాదం ఉంది.

గిరిజనుల గోడు పట్టని ప్రభుత్వం : సిపిఎం

ప్రజాశక్తి - బాలాయపల్లి



గిరిజనుల కష్టాలు తెలుసుకుంటున్న వి.నాగరాజు

గిరిజనులు సమస్యలతో సతమతమవుతుంటే ఈ ప్రభుత్వం ఉన్నట్టా లేనట్టా అనే సందేహం కలుగుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ప్రశ్నించారు. గురువారం మండలంలోని అక్కసముద్రం గ్రామాన్ని సందర్శించారు. 'జగనన్న కాలనీ'ల పేరుతో ప్రభుత్వం ఓ వైపు హడావిడి చేస్తుంటే, ఇప్పటికీ గిరిజనులు గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం జగనన్న కాలనీలను ఎవరికి కేటాయించిందో అర్థం కావడం లేదన్నారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ 'అయ్యా చినుకు పడితే గ్రామంలో ఉన్న పాఠశాలలో తలదాచుకోవాల్సిందే. అధికారులకు అనేకమార్లు విన్నవించాం. మా గోడు పట్టించుకోలేదు. గత ఏడాది వర్షం వచ్చినపుడు మా గుడిసెల్లోకి మోకాలిలోతు నీళ్లొచ్చాయి. ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందలేదు. కర్ర సాయం లేనిదే అడుగు పెట్టలేని వికలాంగులు ఉంటే వారికి వికలాంగుల పింఛన్ ఇవ్వకుండా, మామూలు పింఛనే ఇస్తున్నారు' అని చంద్ర, రాజేశ్వరి వాపోయారు. నల్లగొండ శ్రీనివాసులుకు 90 శాతం మానసిక వైకల్యం ఉంటే మామూలు పింఛనే ఇస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామంలో గిరిజనులు తొమ్మిది కుటుంబాలు ఉన్నాయని, అయినా అధికారులు తమ గురించి పట్టించుకోవడం లేదని, సచివాయ సిబ్బంది మా సమస్యలు వినడం లేదని, ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని కన్నీరుమున్నీరయ్యారు.

మీ సమస్యలపై పోరాటం చేస్తా : వి.నాగరాజు,

మీకు అందుబాటులో ఉంటూ, మీ సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యంలో పోరాటం చేస్తానని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు భరోసా ఇచ్చారు. అక్కసముద్రం గ్రామ గిరిజనుల బతుకు దుర్భరంగా ఉందని, తరాలు మారుతున్నా వీరి బతుకులు మారడం లేదన్నారు. గూడూరు ఆర్డీవోకు సమస్యలపై వాట్సాప్ ద్వారా వినతిపత్రం పంపించారు. పక్కా గృహాలు మంజూరు చేసేందుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వడ్డిపల్లి చెంగయ్య ఉన్నారు.

శ్రీ వేదనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నాగలాపురం : శ్రీ వేదవల్లీ సమేత శ్రీ వేదనారాయణ స్వామివారి ఆలయంలో గురువారం ఉదయం ధ్వజారోహణంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ ఏకాంబరం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు పద్మావతి అమ్మవారి స్వర్ణరథోత్సవం

తిరుచానూరు : శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక వసంతోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు మధ్యాహ్నం శుక్రవారపుతోటలో స్నపనతిరుమంజనం వేడుకగా జరిగింది. మే 5న ఉదయం 9.10 గంటలకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరుగనుంది. భక్తులు ఒక్కొక్కరు రూ.150 చెల్లించి ఒక రోజు వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. వసంతోత్సవం కారణంగా గురువారం కల్యాణం, సహస్రదీపాలంకార సేవలు రద్దయ్యాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో గోవింద రాజన్, ఎస్వీబీసీ సిఈవో షణ్ముఖ కుమార్, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అన్నమయ్య 615వ జయంతి ఉత్సవాలు

తిరుపతి సిటి : శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులవారి 615వ జయంతి ఉత్సవాలు మే 6 నుండి 12వ తేదీ వరకు అన్నమయ్య జన్మస్థలమైన తాళ్లపాకలోని ధ్యానమందిరం, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద, తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో జరగనున్నాయి. తాళ్లపాకలోని ధ్యానమందిరం వద్ద ఉదయం 10 గంటలకు శ్రీవారి కల్యాణం నిర్వహిస్తారు.



పట్టువదలని క్రీడాకారులు

ప్రజాశక్తి -తిరుపతి సిటి

ఎపి సిఎం కప్ నాలుగో రోజు పోటీలోనూ క్రీడాకారులు పట్టువదలక విజేతలుగా నిలిచేందుకు ప్రయత్నిస్తున్నారు. ఖోఖో పురుషుల విభాగంలో విశాఖపట్నం, విజయనగరం, ప్రకాశం, ఈస్టు గోదావరి విజయం సాధించాయి. రన్నింగ్‌రేస్ మహిళల విభాగంలో విశాఖపట్నం 25 పాయింట్లతో, అనంతపురం 13 పాయింట్లతో, కర్నూలు 12 పాయింట్లతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. రన్నింగ్‌రేస్ పురుషుల విభాగంలో విజయనగరం 21, విశాఖపట్నం 14, వెస్ట్‌గోదావరి 12 పాయింట్లతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. వెయిట్ లిఫ్టింగ్ మహిళా విభాగంలో వెస్ట్‌గోదారవరి (14), శ్రీకాకుళం (14), గుంటూరు (11) మొదటి, రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. వెయిట్ లిఫ్టింగ్ పురుషుల విభాగంలో వెస్ట్‌గోదావరి (14), కర్నూలు (19), ఈస్టు గోదావరి (15) స్థానాల్లో నిలిచాయి. బ్యాట్మెంటన్‌లో వెస్ట్‌గోదావరి, కడప, కృష్ణా వరుస స్థానాల్లో ఉన్నాయి. మహిళల విభాగంలో వెస్ట్‌గోదావరి, కృష్ణ, కడపలు విజయం సాధించాయి. సెట్విన్ సిఇఒ డాక్టర్ వి.మురళీకృష్ణ ఈ క్రీడలను పర్యవేక్షిస్తున్నారు. ఒలంపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వై.ప్రవీణ్, కర్నూలు జాయింట్ సెక్రటరీ ఆర్.శ్రీధర్ పాల్గొన్నారు.

టిటిడి ఆధ్వర్యంలో ఏడాదంతా యజ్ఞయాగాదులు

తిరుపతి సిటి : లోకక్షేమం కోసం టిటిడి ఆధ్వర్యంలో వేద విశ్వ విద్యాలయంలో ఏడాదంతా యజ్ఞయాగాదులు, వ్రతాలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని జెఇఒ సదా భార్గవి అధికారులను ఆదేశించారు. టిటిడి పరిపాలనా భవనంలోని ఛాంబర్‌లో మ్యాన్‌స్క్రిప్ట్ ప్రాజెక్టు ప్రగతిపై అధికారులతో సమీక్షించారు. ఎస్వీబీసీ ద్వారా ఈ కార్యక్రమాలను ప్రజలకు ప్రచరారం చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. వేదాలు, పురాణాల్లో చెప్పిన వ్యక్తిత్వ వికాసోపాయాలను వేద విశ్వ విద్యాలయం పండితుల చేత చెప్పించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మే నెలాఖరులోపు ఈ కార్యక్రమాలను అప్‌లోడ్ చేయడానికి అనుగుణంగా వేద విశ్వ విద్యాలయం స్టూడియోలో ఉపన్యాసాల చిత్రీకరణ ప్రారంభించారు. యు ట్యూబ్ , ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో వీటిని ప్రచారం చేయాలన్నారు. ఎస్వీ బీసీ ముఖ్య కార్యనిర్వహణాధికారి షణ్ముఖ్ కుమార్, వేద విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య రాధే శ్యామ్, ఈ ఈ మల్లిఖార్జున్ సమీక్షలో పాల్గొన్నారు.

నేడు రెండో విడత వైఎస్సార్ కళ్యాణమస్తు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

రెండో విడత వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాది తోఫా నగదు మొత్తాన్ని అర్హులైన లబ్దిదారుల ఖాతాలో జమచేసే కార్యక్రమాన్ని తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి కంప్యూటర్ బటన్ నొక్కి పెళ్లికూతుళ్ళ తల్లులు ఖాతాల్లో శుక్రవారం జమ చేయనున్నారు. తిరుపతి జిల్లా నుండి లబ్ధిదారులతో, ప్రజా ప్రతినిధులతో కలిసి ఉదయం 10:30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి హాజరయ్యేలా ఏర్పాటు చేశామని కలెక్టర్ కే.వెంకట రమణా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు 'హెచ్‌సిఎల్- టెక్ బి'లో శిక్షణ

తిరుపతి టౌన్ : ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు 'హెచ్ సి ఎల్- టెక్ బి' కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నైపణ్యాభివద్ధి సంస్థ ద్వారా చేపట్టారు. ఈ హెచ్ సి ఎల్- టెక్ బి ద్వారా ఐటీ రంగాలలో రాణించడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థులకు ఉండాల్సిన అర్హతలను వెల్లడించారు. ఇంటర్మీడియట్ నందు ఏదైనా సబ్జెక్టులలో 2021-2022వ సంవత్సరంలో 60శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, 2023 వ సంవత్సరంలో 75శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ ప్రోగ్రాం కి అర్హులు. హెచ్ సి ఎల్- టెక్ బి ఆన్లైన్ పరీక్ష 6 వ తేదీన ఎస్ డి హెచ్ ఆర్ డిగ్రీ కళాశాల, ఎయిర్ బైపాస్ రోడ్డు, న్యూ బాలాజీ కాలనీ తిరుపతి నందు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని, కళాశాల నందు స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా వెసులుబాటు కల్పించడం జరిగింది. అభ్యర్థులకు ఎటువంటి సందేహాలు ఉన్నా మరిన్ని వివరాలకు 9032697478, 7675827308, 8074919939, 9963859160 పైన తెలిపిన ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చును. ఈ అవకాశాన్ని ఇంటర్మీడియట్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవలసినదిగా జిల్లా నైపణ్యాభివద్ధి అధికారి శ్యాం మోహన్ తెలియజేశారు.

వెంగమాంబ సాహిత్యంలో ఆధ్యాత్మిక శక్తి తరంగాలు : ఆచార్య యువశ్రీ

క్యాంపస్ : శ్రీవారి భక్తురాలైన వెంగమాంబ తన సాహిత్యం ద్వారా భక్తుల్లో ఆధ్యాత్మిక శక్తి తరంగాలను వ్యాప్తి చేశారని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఆచార్యులు యువశ్రీ తెలియజేశారు. తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో వెంగమాంబ 293వ జయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సులో ఆచార్య యువశ్రీ "మాతశ్రీ తరిగొండ వెంగమాంబ - జీవన గానం" అనే అంశంపై మాట్లాడారు. వెంగమాంబ రచనల్లో మహిళలకు ఉన్నత స్థానం కల్పించారన్నారు. ధైర్య , సాహసాల్లో పురుషుల కంటే మహిళలు ఎక్కువ అని తన రచనల ద్వారా నిరూపించారని తెలిపారు. సొరకాయల కృష్ణారెడ్డి సదస్సుకు అధ్యక్షత వహించారు. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డాక్టర్ విభీషణశర్మ పాల్గొన్నారు.

జిల్లాలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి : కలెక్టర్

తిరుపతి టౌన్ : జిల్లాలో గహ నిర్మాణాలను వేగవంతం చేయాలని, స్పందన ఆర్జీలు సకాలంలో పరిష్కారం అర్థవంతంగా వుండేలా చూడాలని, రీఓపెన్ జరగరాదని అన్నారు. గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.జవహర్ రెడ్డి పలు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై వర్చువల్ విధానంలో కార్యదర్శులతో, అన్ని జిల్లాల కలెక్టర్లతో , జేసి లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి, జాయింట్ కలెక్టర్ డి కె బాలాజీ , జిల్లా అధికారులు హాజరయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వర్చువల్ సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశమై సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూహక్కు భూరక్ష రీసర్వే కు సంబంధించి 69 గ్రామాల్లో ఈ కే వైసి తో సహా పూర్తయిన 9389 మంది రైతులకు భుహక్కు పత్రాల పంపిణీ 84 శాతం జరిగిందని తప్పులు లేకుండా మిగిలిన భూహక్కు పత్రాలను త్వరగా అందించాలని, హద్దు రాళ్ళు నాటడం వేగవంతం చేయాలని అన్నారు. గృహనిర్మాణలకు సంబంధించి బిలోబేస్ మెంట్ లెవల్ 27 వేలు, బేస్ మెంట్ లెవల్ 18 వేలకు పైగా వున్నాయని , పూర్తియినవి 14, 500 వరకు వున్నాయని తెలిపారు. అర్హతగల రైతులకు డ్రిప్ పరికరాలు జూలై 20 లోపు అందించాలని సూచించారు. నరేగా ఉపాధి పనుల జాబ్ కార్డుల ఆధార్ అనుసంధానం జూన్ ఆఖరకు పూర్తి కావాలని తెలిపారు. డి ఆర్ ఓ శ్రీనివాసరావు, డి పి ఓ రాజశేఖర్ రెడ్డి, పిడిలు డ్వామా శ్రీనివాస ప్రసాద్, మెప్మా రాధమ్మ, డి ఆర్ డి ఎ జ్యోతి, హౌసింగ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా తిరుపతిని తీర్చిదిద్దుదాం : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుపతి నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చి దిద్దేందుకు అందరూ కషి చేయాలని పారిశుద్ధ్య విభాగపు అధికారులను కమిషనర్ హరిత ఆదేశించారు. నగరపాలక సంస్థ లో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖ అధికారులు, శానిటరీ సూపర్ వైజర్లు, మెస్త్రిలతో నగరంలో పారిశుద్ధ్య నిర్వహణపై సమావేశ మందిరంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ త్వరలోనే స్వచ్ సర్వేక్షన్ బందం తిరుపతికి రానుందన్నారు. నగరంలో ఎక్కడా చెత్త లేకుండా సిబ్బంది అంతా కలసి కట్టుగా పనిచేయాలని అన్నారు. ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హరకష్ణ పాల్గొన్నారు.


కమిషనర్ బంగ్లా నిర్మాణానికి భూమిపూజ



ఎస్వీ యూనివర్సిటీ పక్కన గల నగరపాలక సంస్థ స్థలంలో నిర్మించనున్న కమిషనర్ బంగ్లా కు ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, అభినయ రెడ్డి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరపాలక సంస్థ కమిషనర్ నివాసం కొరకు 150 లక్షల రూపాయలతో నూతనంగా అధునాతనమైన భవనాన్ని నిర్మించనున్నామన్నారు. ఈ భవన నిర్మాణానికి ఎస్వీయూ ఆవరణలోని మునిసిపల్ స్థలంలో భూమిపూజ చేశామన్నారు. వీలైనంత త్వరగా బంగ్లా నిర్మిస్తారన్నారు. అన్ని ప్రాంతాల్లో కమిషనర్ లకు నివాస సముదాయాలు ఉన్నాయని ఇక్కడ లేక పోవడంతో నూతనంగా భవనం నిర్మిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డి.ఈ.రవీంద్రా రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికష్ణ ఉన్నారు.

గంగమ్మకు రూ.లక్ష విరాళం

తిరుపతి టౌన్ : శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతర సందర్భంగా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఆధ్వర్యంలో నగరమంతటా 30 మండపాల్లో గంగమ్మ విగ్రహాలను కొలువుదీర్చారు. గంగమ్మ మండపాలన్నీ గంగమ్మ స్వర కుంభాభిషేకం ఆల్బమ్ సాంగ్స్ తో సందడిగా మారాయి. బ్రహ్మోత్సవాల తరహాలో గంగమ్మ జాతర జరపనున్నట్లు ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు.




గంగమ్మకు సాయిసుధ ఆస్పత్రి డాక్టర్ సుధారాణి లక్ష రూపాయల విరాళాన్ని ఎంఎల్ఎకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కట్టా గోపి యాదవ్ ధర్మకర్తల మండలి టి. వెంకటేశ్వరరావు, యం. హరినాథ్ రెడ్డి, టి. రమణమ్మ, , పి. ధన శేఖర్, వి. కష్ణమ్మ, వి. గీత, యన్. భారతి పాల్గొన్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి యం. ముని కష్ణయ్య తెలిపారు

ఉపాధి పనుల పరిశీలన



ప్రజాశక్తి-పెళ్లకూరు: మండలంలోని నెలబల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఉపాధి హామీ పథక సంచాలకులు శ్రీనివాస ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పని వివరాలు, ఎంత సమయం పని చేస్తున్నారు.. కూలి ఎంత పడుతోంది అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని, ప్రతిఒక్కరికి రోజు రూ.272 కూలి వచ్చేలా మార్కింగ్ ఇచ్చి పని చేయించాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచనలిచ్చారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున, సమయపాలన పాటించి పనులు చేయాలని, ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, తాగునీటి సౌకర్యంతో పాటు ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈసీ బానుశేఖర్, గోవర్ధన్, వెంకటేశ్వర్లు, తిరుపాల్ పాల్గొన్నారు.

బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న పలువురి బాధితులకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా చేతుల మీదుగా గురువారం మంత్రి కార్యాలయంలో రూ13.60 లక్షల ఆర్థిక సాయం అందించారు. నగరి మున్సిపాలిటీలోని బాబురెడ్డి, గోపీనాథ్, నాగమ్మ, పుత్తూరు మున్సిపాలిటీకి చెందిన సురేష్ బాబు, విజయపురం మండలం కోసలనగరం గ్రామానికి చెందిన చాందినిలకు సాయం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలకష్ణ మొదలియార్, అయ్యప్ప, విజయపురం మండల ఎంపీటీసీ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా రైల్వేగేటు పనులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని ఆర్డీఎం వద్ద రైల్వే గేటు (56వ గేటు) మరమ్మతు పనులు అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం సీపీఐ పట్టణ కార్యదర్శి డి మహేష్ ఆధ్వర్యంలో ఆటోను తోస్తూ నిరసన తెలిపారు. అనంతరం సీనియర్ సెక్షన్ ఇంజినీర్ బాలాజీకి వినతిపత్రం అందించారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సెల్వరాజాచారి, రమేష్ , గోపి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దాసరి నారాయణరావు జయంతి


ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలో తెలుగు చలనచిత్ర దర్శకరత్న డాక్టర్ దాసరి నారాయణరావు జయంతి సందర్భంగా పుత్తూరు జనసేన పార్టీ, కాపు సంక్షేమ ఆర్గనైజర్ సెక్రెటరీ. పి గోపి రాయల్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాసరి నారాయణరావు చిత్ర పరిశ్రమకు ఎంతోమందిని పరిచయం చేసిన గొప్ప వ్యక్తి అని.. వంద చిత్రాలకుపైగా దర్శకత్వం వహించి వరల్డ్ రికార్డు సాధించిన గొప్ప వ్యక్తి అన్నారు. పుత్తూరు జనసేన పార్టీ కృష్ణయ్య, శ్రీరామ్, గోపి, రాజా, రమేష్ పాల్గొన్నారు.

అధ్యాపకుల శిక్షణ బ్రోచర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి-కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల, జెనోటియా సంయుక్తంగా ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మిషన్ లెర్నింగ్ అనే అంశంపై ఐదు రోజుల పాటు 22 నుంచి 26 వరకు అధ్యాపక శిక్షణ తరగతులు జరగనున్నాయి. గురువారం శిక్షణ తరగతుల బ్రోచర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్‌బికేఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ్ కుమార్‌రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ జి.హరినాథరెడ్డి, కోఆర్డినేటర్లు డాక్టర్ షేక్ మాహబూబ్ బాషా, పి.వలిబాషా పాల్గొన్నారు.

సభ్యుల వివరాలు యాప్‌లో నమోదు చేసుకోవాలి



ప్రజాశక్తి-కోట: పొదుపు సంఘాలకు సంబంధించిన పూర్తి డేటా వివరాలను లోకోస్ యాప్‌లో డౌన్లోడ్ చేయాలని ఏపీఎం రత్నయ్య వీఏవోలకు సూచించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరుగుతున్న శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. లోకోస్ యాప్ డౌన్లోడ్ చేసుకుని ఎలా పొదుపు సంఘాల సభ్యుల డేటా వివరాలను నమోదు చేసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు భాస్కర్, శ్రీకాంత్, కష్ణమ్మ, ప్రసాద్, శంకరయ్య, వీఏవోలు పాల్గొన్నారు.

కేఎన్‌రోడ్డులో పైపులైన్ లీకేజీ పనులు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: స్థానిక కేఎన్ రోడ్డులో పైపులైన్ లీకేజీ పనులను మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎంఎన్ రెడ్డి గురువారం పర్యవేక్షించారు. అలాగే ప్రధాన కాలువను కొంతమంది ఆక్రమించి భవనాలు నిర్మించినట్టుగా ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో సర్వేయర్‌తో సర్వే చేయించారు. కాలువను ఆక్రమించి భవనాలు, ప్రహరీ ఏర్పాటు చేసుకున్న యజమానులు ఎవరైతే ఉన్నారో వారందరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి నిర్మాణాలను వెంటనే తొలగించి పురపాలక సంఘం వారికి సహకరించాని కోరారు. అలాగే నందిమంగళం శ్మశాన రోడ్డు ఆనుకుని ఉన్న మురుగునీటి కాలువను పరిశీలించారు.

వేసవి దుక్కులు.. సారవంతం

భూసార పరీక్షలకు సరైన సమయం

తెగుళ్లు, కలుపు నివారణకు అవకాశం



ప్రజాశక్తి-బాలాయపల్లి: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు పండిన సమయంలో వేసవి కాలంలో దుక్కి దున్నితే భూసారం పెరగడంతో అధికంగా పంటలు దిగుబడి వస్తుంది. వేసవి కాలంలో పంట పండిన తర్వాత తిరిగి వర్షాకాలం వచ్చే వరకు భూమిని దున్నకుండా వదిలేస్తారు చాలా మంది రైతులు అలా చేయడంతో కలుపు మొక్కలు పెరిగి, భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి, భూమికి సత్తువ లేకుండా పోతుంది. సీజన్ దాదాపుగా ముగుస్తోంది . రైతులు సాగుచేసిన పంట ఉత్పత్తులు చేతికి వస్తున్నాయి. సాగు భూములు సైతం ఖాళీ అవుతున్నాయి. ప్రస్తుతం వేసవి దుక్కులకు, భూసార పరీక్షలు చేయించుకోవడానికి ఇదే సరైనా సమయం. ముఖ్యంగా వేసవిదుక్కులు చేయడంతతో వానాకాలం పంటలో తెగుళ్లు, కలుపు మొక్కల నివారణకు ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

నీరు ఆవిరయ్యే ప్రమాదం

పంట పండిన అనంతరం తిరిగి వర్షాకాలం వచ్చే వరకు భూమిని దున్నకుండా వదిలేస్తే కలుపు మొక్కలు పెరిగి భూమినిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి, భూమికి సత్తువ లేకుండా చేస్తాయి. ఫలితంగా భూసారం తగ్గిపోవడమే కాకుండా భూమి లోపలి పొరల నుంచి నీరు గ్రహించుకుని ఆవిరై పోయే ప్రమాదం ఉంది. వర్షాలకు ముందే భూమిని దున్నడంతో తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. లోతు దుక్కులతో భూమి పైపొరలు కిందికి, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. వేసవి దుక్కులు దున్నే ముందు పశువుల ఎరువు, కంపోస్టు ఎరువు, మట్టిని వెదజల్లడంతో సారవంతమైన పంట దిగుబడితో పాటు తేమశాతం పెరుగుతుంది.


వేసవి దుక్కి పంటలకు మేలు



వేసవి దుక్కులతో పంటకు ఎంతో మేలు కలుగుతుంది. ముఖ్యంగా కలుపు, చీడ పీడల తీవ్రత తగ్గుతుంది. రైతులు ప్రతి 2-3 సంవత్స రాలకు ఒక సారైనా వేసవిలో లోతు దుక్కులను చేసు కోవడం మంచిది. భూసార పరీక్షలు చేయించుకుని తగిన ఎరువులను వాడుకోవాలి.

- శిరీష, వ్యవసాయాధికారిణి, బాలాయ పలి

సి.ఆర్.రెడ్డి సేవలు మరువలేనవి



ప్రజాశక్తి-గూడూరు టౌన్: పేద ప్రజలకు విద్య, వైద్యం తక్కువ ధరలకే అందించి ప్రజా డాక్టర్‌గా సి.ఆర్ రెడ్డి అందించిన సేవలు మరువలేనివని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు ఆకాంక్షించారు. గూడూరు పట్టణంలో జరిగిన సి.ఆర్ రెడ్డి సంతాప సభలో వారు పాల్గొన్నారు. గూడూరు పట్టణంలో ప్రజా డాక్టర్ గా పేరుపొందిన డాక్టర్ సిఆర్ రెడ్డి ఇటీవల మతి చెందారు. గురువారం వారి ఉత్తర క్రియల సందర్భంగా జరిగిన సంతాప సభకు హాజరై నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్, తెలంగాణ ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, డాక్టర్ రోహిణి, డాక్టర్ జనార్దన్ రెడ్డి , ఎల్లసిరి గోపాల్ రెడ్డి , చేవూరు విజయమోహన్ రెడ్డి , సురేంద్ర రెడ్డి , పట్టణానికి చెందిన పలువురు డాక్టర్లు , స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

వజ్రమ్మకు మధ్యాహ్న భోజన కార్మికుల మద్దతు




ప్రజాశక్తి-ఓజిలి: గత పది రోజులుగా వజ్రమ్మను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసనకు పెళ్లకూరు మండలంతోపాటు సత్యవేడు నియోజకవర్గంలోని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓజిలి మండల పరిధిలోని పున్నేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలుగా విధులు నిర్వహిస్తున్న వజ్రమ్మను స్థానిక రాజకీయ ఒత్తిళ్ల కారణంగా 23 సంవత్సరాలుగా పనిచేస్తున్న వజ్రమ్మను అకారణంగా తొలగించారని మండిపడ్డారు. ఒక దళిత మహిళపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం దారుణమన్నారు. డిప్యూటీ డీఈవో దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికులు మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట వంటా వార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎస్.ముకుంద, చాపల వెంకటేశ్వర్లు, మధ్యాహ్నం భోజనం కార్మికులు జిల్లా అధ్యక్షులు శాంతమ్మ, కార్యదర్శి కె. విజయమ్మ , వివిధ మండలాల మధ్యాహ్న భోజన కార్మికులు శాంతమ్మ, సుగుణమ్మ, భారతి, విమలమ్మ, సుమతమ్మ, జయమ్మ, బి గోపాల్, బీఎస్పీ నాయకులు బందిల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన అవసరం



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో త్రివిక్రమరావు ఆధ్వర్యంలో గురువారం ప్రధానమంత్రి జీవిత బీమా యోజన , ప్రధానమంత్రి సబ్సిడీ యోజన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పేద ప్రజల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు బ్యాంక్ మేనేజర్ ప్రతాప్, ఏపీఎం ఇందిర, పంచాయతీ సెక్రటరీలు, సీసీలు వీవోఏలు పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి జయంతి



ప్రజాశక్తి-గూడూరు: గూడూరు పరిధిలోని కుంద కూరు, అలిమిలి, వెడిచర్ల గ్రామాల మధ్యలో కను మురాయి కొండపై వెలసిన శ్రీలక్ష్మీనర సింహస్వామి ఆలయంలో నరసింహస్వామి జయంతి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పాల్గొన్న ఎమ్మెల్సీ మేరిగ మురళిని ఆలయ నిర్వహణ కార్యవర్గ సభ్యులు బత్తల సుబ్బారెడ్డి సత్కరించారు. కుందకూరు సర్పంచి శ్రీనివాసులు, బాబురెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ బాబురెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, డైరెక్టర్ కృష్ణయ్య, పణీంద్రరెడ్డి, ఓబుల్ రెడ్డి, శివరెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ అండతోనే రాజీవ్‌నగర్‌లో అక్రమాలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అధికార పార్టీ అండతోనే రాజీవ్ నగర్ లో అక్రమాలు జరుగుతున్నాయని టీడీపీ నియోజకవర్గం ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆరోపించారు. స్థానిక ఎన్టీఆర్ భవన్లో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రాజీవ్ నగర్ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ఇళ్ల స్థలాలు కోల్పోయిన వారికి వాటిని తిరిగి అప్పగిస్తామన్నారు. ఈ అక్రమాల్లో ఓ పురపాలక ఉద్యోగి తో పాటు సంబంధిత వీఆర్వో కీలక పాత్ర పోషించారన్నారు. వీరితో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి ప్రధాన అనుచరులు కూడా ఉన్నట్లు ఆరోపించారు. తన తండ్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో రాజీవ్ నగర్ అక్రమాలపై విచారణ జరిపించి, అనర్హులకు ఇచ్చిన 2,700కు పైగా పట్టాలు రద్దు చేయించారన్నారు. ఈ స్థలాలు ఆక్రమణకు కాపాడారన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక కొందరు అధికారుల సాయంతో ఈ నకిలీ పట్టాల రాకెట్ నడిపిస్తున్నారని విమర్శించారు. గతంలో తొట్టంబేడు తహశీల్దారుగా పని చేసిన ఓ వ్యక్తి సంతకాలతో స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి తన అనుచరులకు రాజీవ్ నగర్ లో సుమారు 300 పట్టాలు ఇప్పించారన్నారని ఆరోపించారు. ఈ పట్టాల మంజూరుపై ఉన్నతాధికారుల విచారణ జరపాలని ఆయన డిమాండు చేశారు.

మహా పాదయాత్రలో మోహిత్‌రెడ్డికి నీరాజనాలు



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: మండలంలోని రంగన్నగారిగడ్డ, కోటబైలు పంచాయతీల్లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గడపగడపకు మహా పాదయాత్రను గురువారం కొనసాగించగా.. ప్రజలు ఆయనకు మంగళహారతులతో నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా మోహిత్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజలకు మంచి చేసిందని..అందుకే ధైర్యంగా అందరి ముందుకొచ్చి మంచిని చెప్పగలుగుతున్నామన్నారు. ప్రతి ఇంటా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసి ఆదుకుంటోందని.. ప్రతి పంచాయతీలో జగనన్న పాలన పనితీరుపై అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చొరవతో రంగన్నగారిగడ్డ, కోటబైలు పంచాయతీలలో రహదారులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కులం, మతం, వర్గాలు, పార్టీలకు అతీతంగా ప్రజా సంక్షేమ పథకాలు అందించిన ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమేనన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్ రెడ్డి, డీసీసీబీ బ్యాంక్ మాజీ ఛైర్మన్ సహదేవ్‌రెడ్డి, రెడ్డెమ్మ, రామ్మూర్తి, బాబురెడ్డి, కదీర్, శ్రీరాములు, యుగేష్, సుబ్రమణ్యం, పార్టీ కార్యకర్తలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వాన్ని సాగనంపండి



ప్రజాశక్తి-ఓజిలి: మే డే వారోత్సవాలు పురస్కరించుకొని ఓజిలి మండలంలోని పలు గ్రామాల్లో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చాపల వెంకటేశ్వర్లు గురువారం జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు కార్మికుల పక్షపాతిగా ఉంటూ అనేక రంగాల్లో కార్మికులు, కష్టజీవుల కోసం అనేక ఉద్యమాలు చేసిన చరిత్ర సీఐటీయూకు మాత్రమే దక్కుతుందన్నారు. దేశంలో ప్రజా సంపదను కార్పొరేట్ వర్గాలైన అదాని, అంబానీలకు కట్టబెట్టడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేవీకేఎస్ జిల్లా అధ్యక్షులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని భాషలకు తల్లి.. సంస్కృతం



ప్రజాశక్తి-క్యాంపస్: సంస్కృత భాష అన్ని భాషలకు తల్లి వంటిది అని తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకరరెడ్డి పేర్కొన్నారు. ఉత్కర్ష మహోత్సవంలో రెండవ రోజు విశాఖ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి, శ్రీ స్వాత్మానంద సరస్వతీ స్వామి వారు విచ్చేసి అనుగ్రహ భాషణం అందించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర రెడ్డి, ప్రభుత్వ విప్, చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర రెడ్డి హాజరయ్యారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుళ్ళపల్లి శ్రీరామకష్ణమూర్తి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర స్వామి మాట్లాడుతూ "నరసింహ జయంతి సందర్భంగా ఇక్కడికి విచ్చేయడం, భారతదేశ నలుమూలల నుండి విచ్చేసిన మహా పండితుల సభ జరగడం ఆనందదాయకం అన్నారు. భారతీయ సంస్కృతి పరిరక్షణకు వేద వేదాంతాలతో పాటు ఇతర శాస్త్రముల అధ్యయనం చేయడం కూడా చాలా అవసరం అని చెప్పారు. చంద్రగిరి శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ వేదాన్ని, సంస్కృత భాషను కాపాడటంతో మన సంస్కృతి కలకాలం నిలుస్తుందన్నారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి జి.ఎస్.ఆర్ కష్ణమూర్తి, భారతి సంస్థ అఖిలభారత కార్యదర్శి దినేశ కామత్ , కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయం వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలన



ప్రజాశక్తి-తిరుపతి టౌన్: శ్రీ తాతయ్య గుంట గంగమ్మ ఆలయంలో శుక్రవారం ఉదయం నిర్వహించే మహా కుంభాభిషేకం కార్యక్రమం , విగ్రహ ప్రతిష్ట సందర్భంగా భద్రతా ఏర్పాట్లు ను స్థానిక శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి పరిశీలించారు. గురువారం సాయంత్రం తితిదే ఇంజనీరింగ్ అధికారులతో ఆలయ కార్యనిర్వహణాధికారి యం.మునికృష్ణయ్య అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కట్టా గోపి యాదవ్, ధర్మకర్తల మండలి టి.వెంకటేశ్వరరావు, యం.హరినాథ్‌రెడ్డి, టి.రమణమ్మ, పి.ధనశేఖర్, వి.కృష్ణమ్మ, వి.గీత, యన్.భారతి భక్తులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

అనుమానంతో భార్య తలనరికిన భర్త



ప్రజాశక్తి-వాకాడు: చిట్టమూరు మండలం ఎల్లసిరి గ్రామంలో భార్యను తలనరికి హత్య చేసిన సంఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చిట్టమూరు మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన మాధవి(25) యువతికి, ఎల్లసిరి గ్రామానికి చెందిన హరీష్(28) అనే వ్యక్తితో ఎనిమిదేళ్ల క్రితతం వివాహమైంది. వీరికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో రెండేళ్లుగా భర్తకు దూరంగా ఉంటూ వారం రోజులు క్రితం ఎల్లసిరిలోని భర్త దగ్గరకు వచ్చింది. భార్య ఇంటికి వచ్చినప్పటినుండి భర్త తన ఇంటికి వెళ్లకుండా బయటే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో భార్యపై అనుమానం పెంచుకున్న భర్త భార్యను గురువారం తెల్లవారుజామున అతికిరాతకంగా తల నరికి చంపి నిందితుడు చిట్టమూరు పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. ఎస్సై లక్ష్మీ భవాని, సీఐ హరికష్ణ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చిల్లకూరు: చిల్లకూరు మండల పరిధిలోని ఓడూరు రైల్వే స్టేషన్ సమీపంలోని పట్టాలపై గురువారం గుర్తు తెలియని వ్యక్తి మతదేహాన్ని గుర్తించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. పచ్చ చొక్కా ధరించి పూల పూల లుంగీ కట్టుకొని ఉన్నాడని పేర్కొన్నారు. గూడూరు రైల్వే పోలీస్ అధికారి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ ...

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: ద్విచక్ర ద్విచక్ర వాహనాన్ని ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. వరదయ్యపాళెం మండలంలోని నక్కలమిట్ట వద్ద ద్విచక్ర వాహనాన్ని బొలెరో ట్రక్కు ఢీ కొనడంతో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో యానాది వెట్టు గిరిజన కాలనీకి చెందిన వెంకటమ్మ(40) కు తీవ్ర రక్తగాయాలు కావడంతో సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించినట్లు తెలిపారు. సత్యవేడు నుండి ద్విచక్రవాహనంపై తమ గ్రామానికి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుందని, అయితే ప్రమాదానికి కారణమైన బొలెరో ట్రక్ వాహనం తప్పించుకుని పరారీ అవుతుండగా కడూరు క్రాస్ వరకు వెంబడించిన యువకులు వాహనాన్ని పట్టుకుని శ్రీసిటీ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా శ్రీసిటీ సీఐ భాస్కర్ తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి-క్యాంపస్: విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఏఎస్పీ వెంకట్రావు అన్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని న్యాయ విద్యార్థుల వీడ్కోలు సభ సెనేట్ హాల్లో ఆచార్య వీఆర్సీ కృష్ణయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లా విద్యార్థి ఎప్పటికీ న్యాయం కోసం పోరాడాలని నిజాయితీ వైపు ఉండాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు అభివృద్ధే లక్ష్యం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. గురువారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్‌ను తమ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. అనంతరం నాయకులు ఎమ్మెల్యే సతీ మణి , తనయుడుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు ఓటు వేసి గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. నాయకులు ఎన్.వి. రమణయ్య, కొట్టు గోవర్ధన్, సుమన్‌రెడ్డి, సుభాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్తు అందరి బాధ్యత

ప్రజాశక్తి-తిరుచానూరు: పిల్లల భవిష్యత్తు అందరి బాధ్యతని తెలియజేస్తూ భగత్ సింగ్ ట్యూషన్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం యోగిమల్లవరంలోని మునీశ్వరులు ఆలయం వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. డాన్స్, జానపదం, కోలాటం, కరాటే, పాటలు, అందమైన చేతి రాత, పాటలు, క్విజ్, క్యారమ్స్, తెలుగు, ఇంగ్లీషు తప్పులు లేకుండా రాయడం, చదవడం నేర్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9490300496, 9494891414, 9381177172, 9491311169 ఫోన్‌నంబర్లను సంప్రదించాలని కోరారు. డి.వై.ఎఫ్.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ జయచంద్ర, జిల్లా కార్యదర్శి కె.సుమన్, ఎస్ ఎఫ్ ఐ రూరల్ కార్యదర్శి భాస్కర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో రెండో విడత ఉచిత ప్రవేశాలు

ప్రజాశక్తి-కోట: ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలోకి రెండవ విడత ఉచిత ప్రవేశాలు కల్పించడం జరిగిందని కోట మండల విద్యాశాఖాధికారి మానికల వెంకట సునీల్ తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి వి.శేఖర్ సూచనల మేరకు ప్రైవేటు స్కూళ్లలో ఒకటో తరగతిలోకి రెండో విడత ప్రవేశ విధానం, అర్హతలు వెల్లడించారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో ఈనెల 5 నుండి 15 తేదీలోగా అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని.. ఈ సదవకాశం వినియోగించుకోవాలని కోరారు. పూర్తి సమాచారం కోసం ఎంఈవోను సంప్రదించాలని తెలిపారు.